"అది చేతికందేలా పెట్టాలే" అన్నారు మావారు. చేతికందెలా పెడితే దాన్ని నిద్దట్లో చేత్తోతోసెయ్యచ్చు. చేతికందకుండా పెడితే నేను అది తీయబోయి నిద్దట్లో బోర్లపడవచ్చు కిటికీలో పెడితే వర్షం వచ్చిందో లేదో తెలుసుకుందుకు సోదికెళ్ళాలి. ఇన్ని చిక్కు సమస్యలతో మంచం క్రింద మరచెంబు నన్ను నానాయాతన పెట్టింది. రైల్లోనూ అంతే మరచెంబుని ఎంతసేపని ఒళ్ళోపెట్టుకు కూర్చుంటాం. పక్కన పెడితేయిటూ అటూ కదిలినప్పుడు గుచ్చుకుంటుంది. క్రిందపెడితే రైలుకుదుపుకి అది తిరగబడి నీళ్ళన్నీకారిపోయి పక్కవాళ్ళ బెడ్డింగ్ క్రిందకు చేర్తాయి. మరచెంబును ఎక్కడ పెట్టాలి, ఎలా పట్టుకోవాలి. ఎవరుపట్టుకోవాలీ అనేవి చాలా కఠినమైన ప్రశ్నలు.

ప్రయాణాల్లో మరచెంబులు పోతూవుంటాయి. పోతే ఫరవాలేదని వూరుకోగలమా? మరచెంబు చుట్టూవున్న జ్ఞాపకాలు మనల్ని మరీ మరీ బాధించి వేధించి చంపుతాయి, మరచెంబు మూతితో వక్కలు కొట్టొచ్చు. కొబ్బరిచెక్క కొబ్బరి ముక్కలుతినొచ్చు. మర్చిపోయాను, బోయినాలకు ఎవరింటికేనా వెళ్లినప్పుడు మరచెంబులో బూర్లు, లడ్డుకుక్కుకుని రావచ్చు.

మా యింట్లో యిపుడు వెండి మరచెంబులేదు. నాకు టైఫాయిడ్ వచ్చినప్పుడు దానికి కాళ్ళొచ్చి యింట్లోంచి నడిచి వెళ్లిపోయింది. మళ్ళీ మళ్ళీ కొనుక్కోలేముకదా – అప్పుడు నాపెళ్ళికి పెట్టిన ఆ వెండి మరచెంబు ఆ వెర్రిముండ యిప్పుడు ఎవరి మంచం క్రిందవుందో గదా అని అనిపించినపుడు నాకళ్ళు చెమ్మగిల్లుతాయి. అష్టరాల్‌చెంబు – కాని చెంబుచుట్టూ ఎంత జీవితం తిరిగింది? చెమ్బాల గురించి మరోమాటు చెప్తాను.

# పరుపుక్రింద పైజమ్మా

మొన్న మా పిన్నిగారి లలిత ఒంటరిగా బస్సులో వచ్చింది పుట్టింటికి ధూళి ధూసరితలతాంగిలా, బస్సు జర్నీకదా పాపం మొహం కళ్ళూ వాచాయి అనుకున్నాం. అదేంకాదు. దానికి ఆరోనెలలో ఏడోనెలోట – అక్కవుంటెన్నీ తెలీదు. దానికథ విన్నాక నాకు ఏడుపొచ్చింది. దాని మొగుడు బియస్సీ ఎల్లెల్బీట, ఏనుగుగున్నలా వుంటాడు. ఏడువేలు కట్నం పోశారు, మనిషి ఏనుగుగున్నలా వున్నా మొహం ముంగిమొహంట. క్యాంపులమీద తిరిగే వుద్యోగం – నెల్లో యిరవై య్యార్రోజులు కమాను. మా లలిత మా లలితని చెప్పుకోవటం కాదుగాని కాపురాని కెళ్ళినప్పుడు అది లవ్లీగా, నైసుగా, షోగ్గా, చలాకీగా, రంగుల రాణీలా వుండేది. చెప్పాను కదా దాని మొగుడు దిబ్బకొక్కులా ముంగిలా, ఏనుగులా వుంటాడని వాడి కది నవల్సూ పత్రికలు చదివితే చెడిపోతుందని భయంట. సీతారామాంజనేయ యుద్ధం, మోహినీరుక్మాంగద అనుపాము పాటకథ, లక్ష్మణస్వామి మూర్ఛలాటి కథలుచదువుకోమంటాడ్ట.

మా లలిత కష్టపడి సంగీతం చెప్పుకుంది. పియ్యుసీ సెకండ్‌క్లాసులో ప్యాసయింది. అది రేడియోలో ఆడవాళ్ళ ప్రోగ్రాముల్లో వరకట్న దురాచారం గురించి "కన్నెపిల్లలు కనే కలలు" అనే వ్యూహనాటిక రచించి ప్రసారం చేయించింది. దానికి రింగ్ టెన్నీస్, బ్యాడ్‌మింటన్ కూడావచ్చు. అటువంటి బొంగరంలాటి పిల్ల కళ్లు వాచిపోయేలా ఏడుస్తూ బస్సులో వచ్చిందంటే కడుపుతరుక్కుపోదూ?

రెండ్రోజులు దాని మానాన్న ఏడవనిచ్చి "ఏమిటేపిల్లా? ఏమిటి కథ" అని అడిగాను. అది మరికాస్త ఏడిచి "పరుపుక్రింద పైజమ్మా" అంది. పరుపుక్రింద పైజమ్మా ఏమిటే నీ మొగం యీద్భవచన కవిత్వంలా బోధపడకుండా వుంది. "తిన్నగా చెప్పి ఏడు. లేక ఏడ్చయినా చెప్పు" అన్నా, అది కళ్ళు తుడుచుకుని ఒక దిండును ఒళ్ళో వేసుకుని ఆపశోపాలు పడుతూ చెప్పింది.

వాళ్ళాయన కేంపునించొచ్చి పొట్టపగిలేలా భోంచేసి, తమల పాకులు నముల్తూ గేద్దూడలాగ పందిరిమంచంమీద పవళించిలేచి ఎందుకో (నల్లికుట్టింది కామోసు) పరుపు ఎత్తగానే దానికిందో "పైజమ్మా" చారల చారలది కనిపించిందట. దాన్తో అగ్రహోదగ్రుడై గుడ్లెర్రజేస్తు "ఈ పైజమ్మా ఎవరిదే" అని అడిగాడ్ట. మా మొద్దు 'మీదే' అని రెండు తగల్నిచ్చాక "నాకు తెలియదు మొర్రో – సూర్యచంద్రులాన, అష్టదిక్పాలకులాన, మా అమ్మమీదొట్టు, మా నాన్నమీదొట్టు" అని వాపోయిందట, ఆ మహిషాసురుడు అంతటితో ఆగక రెండు మూడ్రోజులు యిల్లంత నరకం చేసి 'ఫో కులటా ఫో పుట్టింటికని' మా లలితను పని మనిషిని సాయం యిచ్చి రిక్షాలో ఎక్కించి బస్సుస్టాండుకు పంపేడ్ట, అది దాని ట్రంకు పెట్టె మోసుకుంటూ ఏడుస్తూ పుట్టింటి కొచ్చింది. ఆ పరుపు క్రింద పైజమ్మా గురించి దాని కసలేమి తెలియదట.

ఎవర్నేనా వకీల్ని సంప్రదిద్దామా అన్నాన్నేను. వకీలెందుకందది. కీలెరిగి వాత పెట్టిద్దామని అన్నాను. విడాకులు పుచ్చుకోవద్దామరి అని అడిగాను. విడాకులెందుకే – ఈ పురుడయాక అన్నీ చూసుకోవచ్చును అందది. వకీల్ని మానేసి మా లలితను డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాము. లేడీ డాక్టరు సంతోషంగా వుండాలమ్మా. తిన్నంత తిని తిరుగు అని అక్కడా యిక్కడా పరీక్షచేసి నవ్వుతూ పదిరూపాయల్తీసుకుని డ్రాయర్లో పడేసుకుంది. వకీలైతేనేమిటి, డాక్టరైతేనేమిటి అనుకుని "పరుపుక్రింద పైజమ్మా" గురించి మీకు తెలుసా అనడిగాను. డాక్టరు తెల్లబోయి నన్ను పరీక్ష చేస్తాను డార్క్ రూంలోకి రమ్మంది. నేను డార్క్ రూంలోకి రాను మీ పరుపు క్రింద పైజమ్మా వుందా చెప్పమని అడిగాను. లేడీ డాక్టరయినా పెళ్ళికాని లేడీయే కనుక కొంచెం సిగ్గుపడి కొంచెం ఎర్రబడి యింకా అంతవరకూ రాలేదన్నట్లు నవ్వి ఒక చీటీ వ్రాసియిచ్చి యీ బిళ్లలు మూడుపూట్ల పుచ్చుకుని పాలుత్రాగి పడుకోమని చెప్పింది నాకు. నాకు తల తిరుగుతోన్నట్లుంటే మళ్ళీ సోమవారం మార్నింగు తొమ్మిది ముప్ఫయిమూడునిముషాలకువస్తే ఇంజక్షనిస్తానంది, వద్దండీ అని మా లలితను తీసుకుని వచ్చేశాను. పెళ్లికాని లేడీ డాక్టర్లింతే ననుకుని పరుపుక్రింద పైజమ్మా గురించి అడగటం పరమడేంజరని గుర్తుపెట్టుకున్నాను.

లలిత దిగులుగా వుంటే కోప్పడ్డాను, మొగుడ్ని మర్చిపోమన్నాను, కొందరు ఆశించినట్లు మళ్లీ త్వరలో మాతృస్వామికం వస్తే నీ మొగుడ్ని చెట్టుకి కట్టి కండచీమలతో కరిపిద్దామన్నాను. పోనీ నీ దిగులు మర్చిపోయేందుకు "చీచీ పురుషులు" అని ఏదైన కత వ్రాయకూడదా అన్నాను.

లలిత మాట్లాడ్డం మానేసింది. దిగులుగా పిచ్చిచూపులు చూస్తూ కూర్చునేది. టిప్ టాప్‌గా వుండే పిల్లకాస్తా జావకారిపోయి శరణం భవ కరుణామయి కురుదీనదయాళో అనే స్థితికి వచ్చింది. సినిమా కెల్దామా అన్నాను తలతిప్పేసింది. మనం ఏం చెప్పినా 'నో' అనే స్థితికి వచ్చింది.

ఈ "పరుపుక్రింద పైజమ్మా సంగతి మీ యింట్లో తెలుసా" అని అడిగాను. లేదంది నీవిలావచ్చినందుకు అనుమానపడలేదా అన్నాను. అనుమానపడ్డారన్నట్లు తలవూపింది. మరి నీ వేమి చెప్పలేదా అన్నాను. చెప్పలేదంది. ఎందుకు చెప్పలేదు అన్నాను. దిండు క్రింద పైజమ్మా అని చెప్తే అందరూ నవ్వుతారు. నన్నో పిచ్చిదానిక్రింద జమకడ్తారని చెప్పింది. లలితా నీలాంటి పిరికివాళ్ళు బాగుపడరని విసుక్కున్నాను.

పోనీలే అని అది బెల్లపుజీళ్ళు తెప్పించుకుని తినడం మొదలెట్టింది. తిండిలో పడిపోతే ఆడాళ్ళు అన్నీ మర్చిపోతారని దానికి రోజు రోజు చేగోడీలు, పులిపొంగరాలు, పకోడీలు వేసి మేపసాగాను. అన్నీ తినికూడా అది దిగులుగా వుండేది. నాకేమి బోధపడలేదు. దీని బ్రతుకు ఏమవుతుందో ఆ మొగుడ్ని నాలుగుతన్ని వాళ్ళ దగ్గర ఏడువేలు పుచ్చుకుని దాని పేరన బ్యాంకులో వేస్తే మంచిదని నాకు తోచింది. నా ఆలోచన మా వారితో చెప్పాను. చెప్పేముందు పరుపు క్రింద పైజమ్మా సంగతి కూడా చెప్పక తప్పలేదు. మావారు పకపకా నవ్వారు. ఒక భారతీయ స్త్రీకి జరిగిన అవమానానికి నవ్వుతారా అన్నాను కళ్లెర్రచేసి.

"లలిత నిలా పిలు- లలిత నిలా పిలు" అన్నారు. "దాన్నేవన్నా అంటే నేనూరుకోను" అన్నాను. యింకా బుర్రటకాయిస్తూ, "డామిట్‌నోర్మ్యాయ్ ఆ ఫూల్‌ని యిలాపిలు" అన్నారు. మావారు చిన్నప్పుడు అంటే అది పరికిణీలు కట్టుకునేటప్పుడు దానికి కాంపోజిట్ లెక్కలు చెప్పేవారులెండి. అది లెక్కలు తప్పుచేసి నప్పుడల్లా "ఫూల్ - ఇడియెట్-రాస్కెల్- యూజులెస్ ఫెలో" అనిదాన్ని తిట్టేవారు. అందుకని అప్పుడు తిడితే బావుంటుంది కాని, కడుపుతో వున్న పిల్లను పట్టుకుని ఫూల్ గీల్ అంటే వాళ్ళ వాళ్ళు పళ్లురాలగొడ్తారు అన్నాను నేను లలితపక్షం వహించి.

లలిత వచ్చి తలుపు త్రోసుకుని నిలబడింది. "ఒస్సే లలితా - మీ యింట్లో చాకలిపద్దు ఎవరు వేస్తారు నువ్వా మీ ఇడియట్టా" అన్నారు నవ్వుతూ. అది నవ్వింది. "ఏవే తల్లీ నిన్ను నేనెంత బుజ్జగించి బ్రతిమాలినా ఒక్కమాట కూడా తిన్నగా మాట్లాడే దానివి కావు. ఈ పురుషజాతి సింహము పలకరించగానే నవ్వుతున్నావా-" అన్నాను. అదిమళ్ళీ నవ్వింది వాళ్ళాయన్ను ఇడియట్ అన్నందుకు అది అభారతీయంగా సంతోషిస్తున్నది. జనసంఘం వాళ్లెవరైనా దీనినవ్వు గమనిస్తే దీన్ని మళ్ళీ భారతీయం చేయాలని పట్టుపడతారు.

"నీ మొగుడికి వుత్తరం రాస్తావూ?" అన్నారు నవ్వుతూ. అది రాయనని మొండికేసింది.

"పోనీ నే వ్రాస్తాను నువ్వు సంతకం పెట్టు" అని కాగితం, కలం తెమ్మన్నారు. చెప్పొద్దు - మధురవాణి చేసినట్లు యింత సిరాతెచ్చి! మీద పోద్దామనిపించింది నాకు. దాని మొగుడికి యీయన ఉత్తరం వ్రాయడమేమిటి నాకసహ్యం వేసింది. ఏదో రాసి దాని చేతిలో పెట్టారు. యిది చదువుకుని సంతకంపెట్టి "పోస్టు చెయ్యి" అని నాకేసి అదోలా చూశారు. నాకు వళ్లు మండిపోతోంది. నేను హేండిల్ చేస్తున్న కేసు ఆయన కెళ్లి పోతోంది.

అది ఇంటికెళ్ళగానే దాని మొగుడు బస్సులో వచ్చాడ్ట త్రుళ్ళుతూ పేలుతూ. అత్తారింట్లో అంతా తన పెళ్ళాలే అన్నంత హుషారులో వున్నాడ్ట. ఆ తెల్లవారిఝామున బస్సులో లలిత ఏడ్నెల్ల కడుపుతో పుట్టింటి కొచ్చిన లలిత, ఏనుగుగున్నలాటి మొగుడ్ని చూసుకుని వాడితో వుడాయించేసిందట. ఈ వార్తవిన్న నాకు నడుం విరిగినట్లయింది. "ఏం అలా వున్నావు పిల్లా" అన్నారు వెక్కిరిస్తూ, నేను మాట్లాడలేదు.

నాకు పరుపు క్రింద పైజమ్మా మిష్టరీ బోధపడలేదు. మొదట మొగుడు అనుమానించాడు. తరువాత వాళ్ళిద్దరూ ఎలా కలిసిపోయారు? ఇంత జరిగాక విడాకులన్నా తీసుకోకుండా సిగ్గులేకుండా ఏ మొగం పెట్టుకుని లలిత మొగుడితో కాపురాని కెళ్ళింది? నా బుర్రకేవీ పాలుపోలేదు. లలిత నన్నేదో అవమానం చేసినట్లు కూడా ఫీలయ్యాను. వుండి వుండి యీ మగాళ్ళమీద అనగా పురుష ప్రపంచం యొక్క దౌర్జన్యయుతమైన వైఖరిపై నాకు కోపం హెచ్చవసాగింది. నేను మా ఇంట్లో లలిత మీద కోపం మావారిమీద చూపించటం ప్రారంభించాను.

"నీకు స్క్రూ లూజయినట్లుందే" అన్నారు మావారు. "నాకు ఒక్క స్క్రూలూజయితే మీకు వందస్క్రూలు లూజవుతాయి. టేక్కేర్" అన్నాను.

"అదేవత్తో దాని మొగుడి దగ్గరకెళ్తే సంతోషించక నామీదపడి ఏడుస్తా వెందుకే - అది అలో లక్ష్మణా అంటూ యిక్కడ పడి వుంటే నీ కళ్లు చల్లగా వుంటాయా" అన్నారు. "ఔరౌరా ఎంత మాటన్నారు? భారతీయ స్త్రీజాతికి లలిత అవమానం చేసింది" అన్నాన్నేను. "నోరు మూసుకో" అన్నారు. మేంమాట్లాడుకోటం మానేశాము. అంటే నేనే - ఆయన పలకరిస్తూనే వున్నారు. ఒకరోజు లలిత వుత్తరం రాసిందే అంటూ వచ్చారు. "ఆ కృతఘ్నురాలు మీకు ఉత్తరం కూడా రాసిందా" అన్నాను నేను కసిదీరా.

అదేమిటే నేనేదో లలితను లేవదీసుకు పోయినట్లు మాట్లాడుతున్నావ్? నీ ఏడుపేదో బోధపడకుండా వుంది అన్నారు. ఆ ఉత్తరం నాకే రాసింది. కొంచెం తగ్గాను, అందులో పరుపుక్రింద పైజమ్మా గురించి వ్రాసింది. "శ్రావణ శుక్రవారంనాడు మొగుడు నిద్రపోతుండగా తలుపు ఓరవాకిలిగా వేసి మా లలిత పేరంటానికి వెళ్ళిందట, అప్పుడే వచ్చాడా రజక చచ్చినాడు. ఆయన పైజమ్మాకి బదులు మరో గున్నఏనుగు పైజమ్మాను తెస్తే అది పరుపుక్రింద పెట్టించి - పైజమ్మా తెచ్చి అమ్మగారికిచ్చి ఈ పైజమ్మా పట్టుకెళ్ళు అన్నాడ్ట ఆ దున్నపోతే. ఈ విషయం

పెళ్లానికి చెప్పలేదు. తనూ మర్చిపోయివచ్చి పరుపుక్రింద పైజమ్మా చూసి పెళ్లాన్ని అనుమానించి నానారభస చేశాడు. "ఇలాటి మొగుడితో మాలలిత ఏం సుఖపడుతుంది?" అన్నాన్నేను.

మావారు అదోలా నవ్వి "లలిత చాలా సుఖపడుతుంది. నీకు తెలీదు, మీ రచయిత్రులిక్కడే డాల్‌లో స్టెప్ వేస్తూవుంటారు" అన్నారు.

"వ్హాట్‌స్సార్ వ్హాట్" అన్నాన్నేను వెక్కిరింతగా.

"లలిత యిప్పుడు పరిగెత్తుకెళ్ళింది మొగుడిమీద మైకంతో కాదు. చిక్కక చిక్కక మిడతంభొట్లు చేతిలో చిక్కాడు - ఇక వాడు ఆ గున్న ఏనుగు మీ లలిత చేతిలో ఆజన్మ ఖైదీయే - చూస్తూ వుండు -వాడ్ని ఓ ఆట ఆడిస్తుంది. ఈ మాత్రం తెలుసుకోలేకపోయావ్" అన్నారు.

"అవును. మీరు చెప్పింది నిజవే. మొన్న లలిత టాక్సీలో వచ్చినపుడు దాని మెళ్లో నాలుగుపేటల చంద్రహారం వుంది. నెక్లెస్ మార్చింది. రవ్వల ముక్కుపుడక కొంది. దాని మొగుడు దాన్నిప్పుడు క్రిందకు దింపడు. టాక్సీలోనేపోతూ ఆ వూర్నించీ వూరికి భుజాలమీద కూర్చోపెట్టుకుని ఎగురుకుంటూ వస్తాడు. మమ్మల్ని సినిమాకు కూడా తీసుకెళ్ళింది. దాని మొగుడిప్పుడు దాని చెప్పుక్రింద తేలు."

# వీపుమీద విమానం

వీప్మీద విమానమేవిటని తెల్లబోతున్నారా చెప్తా-చెప్తా-మీచంటాడో చంటిదో విమానం కోసం ఏడిచి అల్లరి చేసినపుడు మీరో విమానం ఆటని వెంటనే ఆలోచించాలి కదా. అప్పుడు మీ వారిని హాల్లో చాపమీద బోర్లా నాలుగు పాదాల మీదా పారాడే కృష్ణుడి బొమ్మలా పడుకోమనాలి. ఒకవేళ పడుకునుంటే కాస్సేపు పారాడే కృష్ణుడిలా వుండమనండి. అప్పుడు మీ బాబ్జీగాడిని మీరెత్తుకొచ్చి మీవారి వీపుమీద పడుకోబెట్టి వాడు చేతుల్ని చాపినపుడల్లా మీవారు నోటితో "బొంయ్ బొంయ్ బొంయ్" మని ఇంజన్ బయల్దేరిన చప్పుడు చేస్తూ గదిలో యిటూ అటూ గుండ్రంగానూ అడ్డంగానూ, నిలువుగానూ తిరగాలి. మీ బాబ్జీ క్రింద పడిపోకుండా కాళ్ళతో కప్పలా మీవారి నడుంచుట్టూ వాటేసుకుని పట్టుకోవాలి. ఈ ఆట మీరు ఆడిస్తూంటే మీవారు నోటితో విమానం చేసే చప్పుళ్ళన్నీ చేస్తూ వుంటారు. అప్పుడు మీరు గుమ్మం దగ్గిర నిలబడి అలవోకగా నవ్వుతూ ఆనందించాలి. ఈ ఆట విజయం అంతా మీరు మీవారిని పారాడే కృష్ణుడి బొమ్మలా చాపమీద పడుకునేలా చేయటంలో వుంది కిటుకు. చల్ చల్ గుర్రం ఆటని కొంచెం మారిస్తే వీపు మీద విమానం ఆట వస్తుంది. మీవారు కాస్త ఏమరుపాటుగా వుంటే మీ బాబ్జీ వీపు మీదెక్కి విమానం ఆట ఆడుకుందాం రమ్మని మీ వారిని చంపుకు తింటాడు. మీ వారికి మిమ్మల్ని చూసినా బాబ్జీని చూసినా లోపల నుంచి